241) ముఖారి

ప॥ పరము నిహము పంటపండినట్టు । యిరవుగా దానే యెట్టయెదుట నున్నాడు ॥

చ॥ ముంచినమహిమలెల్లా మూర్తివంతమైనట్టు । కాంచినవరములు సాకారమైనట్టు ।
అంచె శృంగారరసాన కంగములు వచ్చినట్టు । యెంచగ శ్రీవేంకటేశు డెదుర నున్నాడు ॥

చ॥ చెలగి ఆకాశానకు చైతన్యము వచ్చినట్టు । అల దయాసింధువు ప్రత్యక్షమైనట్టు ।
మొలచి సుజ్ఞానము మోసులెత్తివుండినట్టు । శ్రీవేంకటేశు డెదుట నున్నాడు ॥

చ॥ పరగ నానందము ప్రతిబింబించినయట్టు । సురలభాగ్యము పొడచూపినట్టు ।
వురుటై యలమేల్మంగ నురమున నించుకొని । యిరవై శ్రీవేంకటేశు డెదుట నున్నాడు ॥